# మిసెస్ పరాంకుశం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1971 లో మల్లాది గారి కలం నుంచి వెలువడిన రెండవ నవల*

*(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)*

### 3

**డియర్ బావగారు,**

నమస్తే. చాలా రోజులకి ఉత్తరం రాస్తున్నాను. పెద్ద విశేషమే ఉంది. చివరికి పెళ్ళిచేసుకోబోతున్నాను. మీకు తెలుసు కాబట్టి అక్కా, మీరూ ఊహించగలరు నా భార్య ఎలా ఉంటుందో. ఆదర్శం అని పేరు పెట్టండి, పట్టుదల అనండి, అవివేకం అని పిలవండి. ఏదయినా సరే. నా కోరిక నెరవేర్చుకోబోతున్నాను.

మీకు అన్ని విషయాలు మొదటే చెప్పాను. మీ సహాయం అందజేస్తానని మాట ఇచ్చారు కాబట్టి రాస్తున్నాను. దయచేసి అక్కయ్యని ఓ రెండు నెలలపాటు నా దగ్గర ఇక్కడ ఉండేలా పంపండి. అక్కయ్య అవసరం ఎంతయినా ఉంది.

మీరు అక్కయ్య ఏ బండికి వచ్చేది తిరుగు టపాలో సమాధానం రాయండి. నా సెలక్షన్ త్వరలో మీరు చూస్తారుగా.

మీ సహాయాన్ని కోరుతూ....

మీ

పరాంకుశం.

ఓసారి ఉత్తరం చదువుకున్నాక గుర్తొచ్చింది తను మరిచిపోయిన విషయం. పి.ఎస్.లో రాశాడు కింద మళ్ళీ.

మీకు నా నమస్కారాలు.

ఇంకో ఇన్‌లాండ్ లెటర్ అందుకుని మరో ఉత్తరం మొదలు పెట్టాడు.

"మామయ్యకి పరాంకుశం నమస్కరించి వ్రాయునది.

పెళ్ళి సంబంధం గురించి మీరు వ్రాసిన ఉతరం అందింది. నా పెళ్ళి నిశ్చయమయింది. త్వరలో చేసుకోబోతున్నాను. నేను చాలా రోజులుగా చెబుతున్నట్లుగానే ఓ వేశ్యని పెళ్ళి చేసుకునే ఏర్పాట్లలో ఉన్నాను. ఏ రోజు జరిగేది తారీకు నిర్ణయం అయాక మళ్ళీ రాస్తాను. అత్తయ్యకు నమస్కారాలు.

పరాంకుశం

ఉత్తరాలు రాయడం ముగించాక చాలాసేపు పెన్నుతో తెల్లకాగితం మీద గీతలు గీస్తూ ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు పరాంకుశం.

"ఏమిటో అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?"

"పెళ్ళి గురించి."

అమ్మాజీ మొహంలో సిగ్గు తొంగిచూసింది. బుగ్గలు ఎర్రబడ్డాయి.

"ఎవరి పెళ్ళిగురించి?" అడిగింది.

"నా పెళ్ళే."

"అదేనా శుభవార్త చెపుతానన్నారు?"

"అవును."

"ఎప్పుడు?"

"మా మామయ్యకు రాసిన ఉత్తరం చదువు."

ఇన్‌లాండ్ లెటర్ అందించాడు అమ్మాజీకి. పూర్తిగా చదివింది. వెంటనే అమ్మాజీ ముఖంలో రంగులు మారాయి. 'నువ్వు పిచ్చివాడివి' అన్నట్లుగా చూసింది పరాంకుశం వంక.

"వేశ్యనా?" నిర్ఘాంతపోయినట్లుగా అడిగింది.

"అవును."

"ఆదర్శమా?" అడిగింది కాస్సేపాగి తడబడుతూ.

సమాధానంగా చిరునవ్వు నవ్వాడు పరాంకుశం. అమ్మాజీ ఏదో మాట్లాడాలని ప్రయత్నించింది. నోట మాట రాలేదు. అప్పటికే కోపంతో ఎర్రగా కందిపోయింది మొహం. అక్కడ నుంచోలేక విసవిసా బయటికి నడిచింది,

అమ్మాజీకి అంత కోపం రావడానికి తన తప్పేమిటో పరాంకుశానికి బోధపడలేదు. తను ముందరి నుంచే అతి చనువు ఇవ్వకుండా జాగ్రత్తగా ఉంటున్నాడు. అమ్మాజీలో లేనిపోని ఆశలు రేపనేలేదు తను.

చదువుకున్నది. అమాయకురాలు కాదు. లోకమంటే ఏమిటో బాగా తెలిసింది అనుక తన అభిప్రాయం చెప్పి ఊరుకుంటుంది. మహా అయితే తనని ఆ ప్రయత్నం నుంచి విరమించుకోమని వారిస్తుంది. అంతే అనుకున్నాడు పరాంకుశం.

మొట్టమొదటగా తన పెళ్ళి గురించి చెప్పింది అమ్మాజీకే.

మొదట రెస్పాన్సు బాగాలేదు అనుకున్నాడు. తను రాసిన రెండు ఇన్‌లాండ్ లెటర్స్ అతికించి చొక్కా జేబులో ఉంచుకున్నాడు.

మర్నాడు ఉదయం దాకా కనబడలేదు అమ్మాజీ. ఉదయం వచ్చి ముభావంగా అడిగింది.

"నాన్నగారికి ఓసారి పేపర్ కావాలిట."

"తీసుకో. కొత్తగా అడుగుతావే?" చెప్పాడు పరాంకుశం.

సమాధానం చెప్పకుండా అమ్మాజీ ముభావంగా పేపర్ తీసుకుని వెళ్ళిపోయింది.

ఆఫీసులో రిజిస్టర్‌లో సంతకం చెయ్యక మునుపే చెప్పాడు శ్రీకంఠం కనబడి.

"ఇవాళ ఉదయం సెలవు తీసుకుందాం. మధ్యాహ్నం రావచ్చు ఆఫీస్‌కి మళ్ళీ."

"దేనికి?" అడిగాడు పరాంకుశం.

"ఓసారి నాయుడిని కలిసి వద్దాం."

"నాయుడెవరు?"

"నీకు కొన్ని ముఖ్యమైన సలహాలు ఇస్తాడు."

"ఏ విషయంలో?"

"ఇంక వేరే విషయం ఏముంది ప్రస్తుతం? అతను సోషల్ ఎండ్ హైజీన్ శాఖలో పనిచేస్తున్నాడు. ఇలాంటి విషయాల్లో దిట్ట."

"ఆ శాఖ గురించి నేను ఎప్పుడూ వినలేదు."

"ముందర సెలవు చీటీ రాయి చెపుతాను."

పరాంకుశం ఉదయానికి సెలవు చీటీ రాసి మేనేజర్‌కి అందించాడు.

"ఏమిటి? మిత్రులిద్దరూ ఏదో ప్రోగ్రాం వేస్కున్నట్లున్నారే? ఇద్దరూ ఒకేసారి సెలవు పెడుతున్నారు?" అడిగాడు మేనేజర్ నవ్వి.

"ఏం లేదు. ఓ చిన్న పని."

"ఆల్ రైట్. వెళ్ళండి."

శ్రీకంఠం భుజం మీద చెయ్యివేసి నడవసాగాడు పరాంకుశం, అమ్మాజీ గురించి ఆలోచిస్తూ.

"సెక్స్ దాంపత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకి, వివాహం అయిన తర్వాత భార్యాభర్తల్లో అనురక్తి విషయంలో వచ్చే పొరపొచ్చాలకి కౌన్సిలింగ్ చేసే ఓ అభ్యుదయ అసోసియేషన్ హైదరాబాద్‌లో ఉంది. నాయుడు అందులో ప్రధాన సలహాదారు. ఆయన్ని మనిద్దరం వెళ్ళి కలుద్దాం. నీకు సహాయం చేయడానికి ఉత్సాహంగా ఉన్నాడు."

"నాయుడు మన ఊరికి వచ్చాడా?"

"షేక్స్పియర్ 'ఏజ్ లక్ మేడ్ హేవ్ ఇట్' అన్నాడు ఇంగ్లీషులో. అదృష్టం కలిసి వస్తే అన్నీ మనని వెదుక్కుంటూ వస్తాయి. నాయుడు ఇక్కడే ఉన్నట్లు తెలిసింది."

"ఎలా తెలిసింది?"

"ఓ స్నేహితుడి ద్వారా. పదకొండు గంటలకి ఎపాయింట్ మెంట్ కూడా తీసుకోమన్నాను. మనకోసం ఎదురుచూస్తూ ఉంటారు నాయుడు."

"నీకు ఎలా పరిచయం ఆయన?" అడిగాడు పరాంకుశం కాస్సేపాగి.

"నాకు ఓ సమస్య ఎదురైనప్పుడు ఆయన సహాయం పొందాను."

"ఎప్పుడు?"

"నేను కాలేజీలో చదివే రోజుల్లో."

"ఏం సమస్య?" అడిగాడు పరాంకుశం.

చిన్నగా నవ్వి చెప్పాడు పరాంకుశం.

"అమ్మాజీకి బాగా కోపం వచ్చింది."

"చెప్పావా?" అడిగాడు శ్రీకంఠం.

"చెప్పాను."

జరిగింది వివరంగా చెప్పాడు పరాంకుశం శ్రీకంఠానికి. అంతా విని నవ్వి సానుభూతిగా చెప్పాడు శ్రీకంఠం.

"పాపం, పిచ్చిపిల్ల."

పెంకుటిల్లు అది. ముందర గదిలో ట్యూబ్ లైట్ వెలుగుతోంది. కరెంట్ పోయి ట్యూబ్ లైటు ఆరిపోతే చీకటయిపోతుంది ఆ గదంతా. వెంటిలేషన్ ఏర్పాట్లు బాగా లేవు.

ముప్ఫై అయిదేళ్ళుంటాయి నాయుడికి. తెల్లటి ఇస్త్రీ బట్టల్లో హుందాగా ఉన్నాడు.

"కంగ్రాజులేషన్స్ మీ గురించి శ్రీకంఠం చెప్పాడు నిన్న రాత్రి."

పరాంకుశం మౌనంగా ఉండిపోయాడు. అతనిలోని జంకుని గమనించి. వృత్తిరీత్యా గడిచిన అనుభవంతో చెప్పాడు నాయుడు.

"ప్రశ్నలేమయినా వేయదలచుకున్నారా? మీకేమైనా సందేహాలుంటే నిర్భయంగా అడగండి."

కొద్దిగా జంకుతూ అడిగాడు పరాంకుశం.

"వ్యభిచారులు పెళ్ళైన తర్వాత పొందికగా ఉంటారా?"

"ఉండరు."

పరాంకుశం మొహం కొద్దిగా పాలిపోయింది. చిరునవ్వి నవ్వి చెప్పాడు నాయుడు.

"ఉండరు. ఈ మీటింగ్ మీకు భవిష్యతులో, దాంపత్యంలో ఎదురయ్యే సమస్యల గురించి, వాటి పరిష్కార మార్గాన్ని గురించి తెలియజేయడానికే ఏర్పాటు చేయబడింది. అన్నీ చెపుతాను. మీరు అధైర్యపడనక్కరలేదు."

"అధైర్యం కాదు జిజ్ఞాస మాత్రమే."

"పొందిక అంటే మీ ఉద్దేశంలో నీతి అనా?"

"అవును."

"మొదటి నాలుగు నెలలు చాలా క్రిటికల్ పీరియడ్ మొదటి సంవత్సరం క్రిటికల్ ఇయర్. జాగ్రత్తగా మసులుకోవాలి. క్రమంగా ఇల్లంటే ఎలా ఉండాలో నేర్పాలి. వ్యభిచారం పాపం, అది మీకు అన్యాయం చేయటం అనే భావన, నమ్మకం పూర్తిగా సౌదామిని మనసులో నాటుకునేలా చెయ్యాలి".

ఆయన చెప్పేది జాగ్రత్తగా వింటున్నాడు పరాంకుశం.

"వేశ్య మనసులో ఎప్పుడూ ఒకటే మెదులుతూంటుంది. ఒళ్ళు అమ్ముకోవటం పాపం కాదు. డబ్బు సంపాదించగల అవకాశం ఉన్నప్పుడు ఊరికే కళ్ళు మూసుకుని కూర్చోవడం ఎందుకనే భావన వాళ్ళల్లో ఉంటుంది. కాబట్టి ఆ అభిప్రాయాన్ని పోగొట్టేగాకా జాగ్రత్తగా ఉండాలి. మీతో ఏమాత్రం అసౌఖ్యం కలిగినా వెంటనే వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తుంది ఏ వేశ్య అయినా.

స్వతంత్రంగా బ్రతికే తనని తీసుకువచ్చి బంధిఖానలో ఉంచాడు అని ఎప్పుడు తోస్తే అప్పుడు వాళ్ళు పక్షుల్లా ఎగిరిపోతారు. అది మొదటిరోజే జరగవచ్చు. మొదటి వారం జరగవచ్చు. లేదా ఓ నెల తర్వాత జరగవచ్చు. కానీ ఓ సంవత్సరం అయిన తర్వాత ఇక వెళ్ళమన్నా వెళ్ళరు."

"ఏం?"

"అప్పటికి వాళ్ళకి దాంపత్య జీవితంలోని మాధుర్యం, ఇల్లాలుగా ఉంటే సంఘులో లభించే గౌరవం, భర్త వల్ల కలిగే లాభాలు లాంటివి పూర్తిగా అర్థమయిపోతాయి. అప్పుడు పాత జీవితం, కొత్త జీవితం బేరీజు వేసుకుని చూసుకుంటే వాళ్ళకి కొత్త జీవితమే మెరుగుగా కనిపిస్తుంది కాబట్టి ఆ తర్వాత సాధారణంగా వాళ్ళు వెళ్ళిపోయే అవకాశాలు దాదాపు నిల్ అనే చెప్పాలి." వివరించాడు నాయుడు.

"దటీజ్ గుడ్ న్యూస్." పరాంకుశం అర్థమయిందన్నట్లుగా తల ఊపి చెప్పాడు.

"నాకు తెలిసిన ఒకతను మీలాగే ఓ వేశ్యను వివాహం చేసుకున్నాడు. అనుమానంతో చావబాది క్రూరంగా చూసాడు. నెల తిరక్కుండానే ఇంట్లో ఉన్న విలువయిన సామానుతో పారిపోయింది."

"పాపం" చెప్పాడు పరాంకుశం.

"తర్వాత వేశ్యలకి, ముఖ్యంగా చిన్నప్పటినుంచీ వేశ్యవృత్తి బాగా అలవాటయిన వారికి కోపం ఎక్కువ. ఆ కోపం తగ్గించేందుకు ప్రయత్నం చేయాలి."

నాయుడు ఓసారి ఇంటి కప్పువైపు ఆలోచనగా చూసి చెప్పాడు.

"మీరు ఎప్పుడూ ఒక విషయం మీద కేంద్రీకరించాలి. మీ సమయస్ఫూర్తి, ప్రేమ మొదలయినదంతా."

శ్రీకంఠం వంక చూశాడు పరాంకుశం ఓసారి.

"సౌదామిని మీ భార్యగానే కాక, ఒక వ్యక్తిగా గౌరవించాలి. గౌరవించినట్లు సౌదామిని దృష్టిలో మీరు కనీసం పడాలి. ఆమెని అనుమానిస్తున్నట్లుగా కనిపించకూడదు. మీ భార్యకిచ్చే గౌరవం ఇవ్వకుండా ఒక యంత్రంలా చూసే పక్షంలో ఇబ్బందికి లోనవుతారు. ఎప్పుడైతే మీరు ఆమెను మంచిదానిగా చూస్తున్నారని సౌదామిని గుర్తించిందో, అప్పటి నించి ఆమె మనస్సాక్షి - కాన్షస్‌నెస్ - పనిచేయడం మొదలవుతుంది. మిమ్మల్ని మోసం చేయకూడదు అనేది మనసులో నాటుకుని, తనకి తెలియకుండానే ఓ విధమైన గిల్టీ కాన్షస్‌నెస్ ఏర్పడుతుంది. అది ఆమె తప్పు చేయకుండా ఉండటానికి అడ్డు పడుతూంటుంది. నే చెప్పేది అర్థమవుతోందా?" అడిగాడు.

"మీరు చెప్పేవి నాకు అర్థమయ్యాయి." జవాబు చెప్పాడు పరాంకుశం.

"ప్రతి చిన్నదానికి అనుమానిస్తుంటే ఒక విధమయిన నిరుత్సాహం ఏర్పడుతుంది. దొంగని దొంగగా చూస్తే దొంగతనానికి వెరవడు. అదే ఆ దొంగని గౌరవంగా కూర్చోబెట్టి మంచినీళ్ళు ఇచ్చి, పెద్దమనిషిలా చూస్తే మీ ఇంట్లో దొంగతనం చేయటానికి సిగ్గుపడతాడు. కాన్షస్‌నెస్ వర్క్స్, మీ పేటలో పేరుమోసిన పెద్ద రౌడీని ఎప్పుడూ 'నువ్వు మంచివాడు' అంటూంటే మీ ముందు తన మంచితనం కాపాడుకోవాలనే భ్రమ అతనిలో యాంత్రికంగా ఏర్పడుతుంది. కాన్షస్‌నెస్ వర్క్స్. అదే విధంగా మీరిచ్చే గౌరవం కాపాడుకోవాలనుకుంటుంది సౌదామిని కూడా."

ఇద్దరు పిల్లలు రావడంతో నాయుడు తను చెప్పేది ఆపాడు. వాళ్ళు అలమారలోని పుస్తకాలు తీసుకుని వెళ్ళాక చెప్పాడు నాయుడు మళ్ళీ.

"శారీరక విషయాల్లో ఫ్రాంక్‌గా మీకు కొన్ని సంగతులు దాచకుండా చెబుతాను. వేశ్యని శారీరకంగా తృప్తిపరచడం కష్టం. ఎందుకంటే, పదమందితో అలవాటయి ఉండటం వల్ల వెనుకటి అనుభవాలు ఆమెకి గుర్తురాకుండా సౌదామినిని మీరు జాగ్రత్తగా చూసుకోవాలి. దీనికి మీకు సెక్స్ గురించిన సరైన అవగాహన ఉండాలి."

"నాకు పెద్దగా లేదు. ఎలా?" అడిగాడు పరాంకుశం కొద్ది ఇబ్బందిగా.

అతని కంగారుని గమనించి నవ్వి చెప్పాడు నాయుడు.

"కంగారు పడకండి. ఈ అవస్థ మొదటి నాలుగయిదు నెలలు మాత్రమే, తర్వాత ఇబ్బంది ఉండదు.. ఈ విషయం మీద మీకు ఉపయోగపడే కొన్ని సంగతులు వివరంగా మన తర్వాతి మీటింగ్‌లో చెపుతాను."

"థాంక్స్."

తను కూర్చున్న కుర్చీకోడు వంక నాయుడు కొన్ని క్షణాలు ఆలోచనగా చూసాడు. తర్వాత చెప్పాడు.

"కొద్దిగా మేజర్ ప్రాబ్లమ్ వి.డి."

పరాంకుశం మౌనంగా వింటూండిపోయాడు, తను అడగాలనుకున్న విషయానికి అడగకుండానే జవాబు లభిస్తున్నందుకు.

ఓ పన్నెండేళ్ళ కుర్రాడు రెండు కంచు గ్లాసుల్లో కాఫీ తీసుకు వచ్చాడు.

"దేనికండీ మీకు శ్రమ." చెప్పాడు పరాంకుశం.

"ఫరవాలేదు తీసుకోండి. నేను ఇందాకే తాగాను." చెప్పాడు నాయుడు.

శ్రీకంఠం, పరాంకుశం కాఫీ తాగేదాకా ఏం మాట్లాడలేదు నాయుడు.

పరాంకుశం కాఫీ తాగి చెప్పాడు.

"చెప్పండి. నేనే అడుగుదామనుకుంటున్నాను ఆ విషయం"

"ముఖ్యమయిన సంగతే ఇది. సాధారణంగా వేశ్యలలో నూటికి డెబ్భై మందికి సుఖరోగం ఉంటుంది. సౌదామినికి అది తప్పకుండా ఉండి ఉండవచ్చు."

అయితే ఎలా అన్నట్లు చూసాడు పరాంకుశం.

"ఫరవాలేదు. తప్పనిసరిగా డాక్టర్ దగ్గర పరీక్ష చేయించాలి. నాకు తెలిసిన ఓ డాక్టర్‌కి లెటర్ రాసి ఇస్తాను. అతను సహాయం చేస్తాడు మీకు. ఉన్నా ఫరవాలేదు. మందులు తీసుకుంటే సరిపోతుంది."

"థాంక్స్ ఎగైన్."

ఇంకా ఏం చెప్పాలా అన్నట్లుగా ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు నాయుడు కొన్ని క్షణాలు. వెంటనే కళ్ళు తెరిచి అడిగాడు పరాంకుశం.

"ఎలా తీసుకు వస్తారు సౌదామినిని?"

"అంటే?"

"సౌదామిని సొంతదారులు సౌదామిని మీ వెంట వెళ్ళడానికి, పెళ్ళి చేసుకుని మీతో ఉండిపోవడానికి సమ్మతించరు. మీ వెంట బయటకి పంపడానికి చాలా డబ్బు అడుగుతారు."

"అవును. పోలీసుల సహాయ పడతారా? లేకపోతే ఏం చేయాలి?"

"పోలీసుల సహాయం తీసుకోండి. సౌదామిని ఇష్టపడితే పోలీసుల రక్షణలో సౌదామినిని ఆ పాప కూపంలోంచి బైటకి తీసుకురావచ్చు."

"పోలీస్ ఇన్‌స్పెక్టర్ నా స్నేహితుడే. సాయంత్రం వెళ్ళి మాట్లాడదాం. అతను సహాయం చేయచ్చేమో చూద్దాం."

"మీ దగ్గరికి రావడం మంచిదైంది. నాకు ఎంతో మేలు చేస్తున్నారు." చెప్పాడు పరాంకుశం కృతజ్ఞతగా.

"మీరు చేసే పని నాకు ఎంతో నచ్చింది. ఇలాంటివి ప్రోత్సహించడం నా బాధ్యత కూడా." చెప్పాడు నాయుడు నవ్వి.

కాస్సేపటిదాకా ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండిపోయారు.

"ఇంకా మీకు ఏమైనా అనుమానాలుంటే అడగండి. హైదరాబాద్ వెళ్ళగానే వేశ్యల గురించి మీకో పుస్తకం పంపిస్తాను, వాళ్ళ మనస్థత్వాల గురించి అనుభవజ్ఞులు రాసిన అభిప్రాయాలు ఆ బుక్‌లో ఉన్నాయి. అవి మీకు తప్పకుండా ఉపయోగపడతాయి."

"ఒక అనుమానం. సౌదామిని తల్లి అయే అవకాశం ఉంటుందా?"

"ఎందుకు ఉండదు? మిగతా వాళ్ళలా సౌదామిని కూడా ఆడదేగా. నిశ్చింతగా ఉండవచ్చు మీరు. నిజానికి మీ వివాహం అయాక సౌదామిని ఎంత త్వరగా తల్లి అయితే అంత మంచిది కూడా, సౌదిమినిని తన తల్లి ప్రేమ కట్టేస్తుంది. కాని పూర్తిగా ఆరోగ్యవంతురాలిగా వున్నప్పుడే తల్లి అవాలి. లేకపోతే పుట్టబోయే బిడ్డ అనారోగ్యానికి లోనౌతుంది."

"గుర్తుంచుకుంటాను, మరో విషయం జీతం రాగానే మొత్తం సౌదామినికి ఇస్తే మంచిదా? నా దగ్గరే ఉంచితే మంచిదా?"

"దట్ డిపెండ్స్. సౌదామిని మనస్థత్వాన్ని బట్టి మీరు ఏం చేయాలన్నది నిర్ణయించాలి."

"ఆఖరి విషయం. ఒకవేళ... ఒకవేళ సౌదామిని పట్టుపడితే ఏం చేయాలి?"

"చిన్నప్పుడు మార్కెట్ దగ్గర మా తమ్ముడితో కలిపి నేను సిగరెట్ తాగడం మా నాన్న చూసాడు, ఇంటికి ఇద్దరం వణికిపోతూ వెళ్ళాం, కొడతాడని, తిడతాడని భయపడ్డాం. కాని నాన్న మాతో బాగానే మాట్లాడాడు. ఎప్పటిలా మామూలుగానే ఉన్నాడు. నేను మళ్ళీ సిగరెట్ తాగలేదు."

"ఐ.సీ."

"నా మనస్థత్వం అలాంటిది. కాని, నాన్న కోప్పడలేదు కదాని తమ్ముడు సిగరెట్స్‌ని వదల్లేదు."

"ఐ.సీ."

"ఎప్పుడైనా సమస్యలు వస్తే నాకు ఉత్తరం రాయండి. పరిష్కార మార్గం రాస్తాను."

"తప్పకుండా."

"సందేహాలున్నా రాయవచ్చు. మిగతా పనికన్నా మీ ఉత్తరానికి ప్రిఫరెన్స్ ఇస్తాను."

"సో కైండ్ ఆఫ్ యు."

"గుడ్‌లక్."

అయిదు నిమిషాల తరువాత శ్రీకంఠం, పరాంకుశం బయటికి వచ్చారు. పరాంకుశం శ్రీకంఠం చెయ్యి నొక్కి సంతోషంగా చెప్పాడు.

"చాలా ఆనందంగా ఉందోయ్. చాలా అనుమానాలు తీరిపోయాయి. నీకప్పుడు వి.డి. అంటటం నాకు మంచిదయింది."

"అన్నీ మన మంచికే." చెప్పాడు శ్రీకంఠం నవ్వి.

"సరిగ్గా ఇక రెండు రోజులు. తర్వాత ఆ నరకం లోంచి సౌదామిని బయటపడుతుంది."

"ఇల్లు?"

చేతి గడియారం చూసుకుని అడిగాడు పరాంకుశం.

"ఇంకా ఆఫీస్‌కు వెళ్ళేందుకు చాలా టైం ఉంది. ఒక సందులో 'అద్దెకు' బోర్డు ఒకటి చూసాను. చూద్దామా ఆ ఇల్లు?"

"దగ్గరయితే పద. చూద్దాం."

ఇద్దరూ కాలినడక దూరంలో ఉన్న ఆ ఇంటికి వెళ్ళారు. ఆ బోర్డు అలాగే ఉంది. ఇద్దరూ ఆ ఇంటి యజమానిని కలుసుకున్నారు.

"ఎక్కడ పని చేస్తున్నారు?" అడిగాడు ఇంటాయన,

"జాన్సన్ అండ్ ఫెర్గుసన్ బిల్డర్స్ కంపెనీలో." చెప్పాడు పరాంకుశం.

"జీతం ఎంత?"

దానికి సమాధానం చెప్పాడు పరాంకుశం. దానికి తృప్తిపడ్డాక చెప్పాడు ఇంటాయన.

"ఫేమిలీ కయితేనే ఇస్తాం."

"ఫేమిలీకే."

"నెలకి అరవై రూపాయలు. రాత్రి పదిన్నర తర్వాత లైటు వేయకూడదు. నీళ్ళు ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. మీ పనిమనిషి ఓ రోజు లోగిలి ఊడ్చాలి. మా పనిమనిషి ఓ రోజు ఊడుస్తుంది."

"అలాగే."

"మీకు అన్నివిధాలా సరిపోతే వెంటనే ప్రవేశిద్దురుగాని. ఓసారి ఇల్లు చూసుకోవడానికి మీ ఆడవాళ్ళని తీసుకురండి. వాళ్ళకి నచ్చడం ముఖ్యం కదా."

ఇద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"ఇంకా పెళ్ళికాలేదు. వారం రోజుల్లో అయిపోతుంది."

"అలాగే కానివ్వండి."

"నా భార్య.. మీకు ఇబ్బందేమో?" గొణిగాడు పరాంకుశం.

"ఏమిటి సంగతి?"

పరాంకుశం తత్తరపాటు కనిపెట్టి అడిగాడు ఇంటాయన.

"అదే." పరాంకుశం తడబడ్డాడు.

వెంటనే శ్రీకంఠం నిర్భయంగా చెప్పాడు.

"నా స్నేహితుడు పెళ్ళిచేసుకోబోయేది ఒక వేశ్యని, ఇద్దరూ సంసారుల్లా ఉంటారు. మీకభ్యంతరమా?"

"ఏమిటి?!?" కళ్ళు చిట్లించి చూశాడు.

"చెప్పానుగా, మళ్ళీ చెప్పినా అదే"

ఆయన ఇద్దరి వంకా ఎగాదిగా చూశాడు.

"ఇది సంసారులుండే ఇల్లు. సానివాడలో లేదు మా ఇల్లు."

"సంసారులే ఈ ఇంట్లోకి వచ్చేది కూడా."

"మరి నువ్వు చెప్పింది ఏమిటబ్బాయ్?"

"పెళ్ళి అనేది ఒక వేశ్యతో. ఆ తర్వాత సంసారం చేస్తుంది."

"అలాంటి వాళ్ళకి ఇల్లు ఇవ్వను. నాకు ఎద్దరు ఎదిగిన కూతుళ్ళు, ఓ విధవ చెల్లెలు ఉన్నారు తెలుసా? ఈ వేళ ఒక పెళ్ళాం, రేపో పెళ్ళాం. పెళ్ళాల్ని ఇలా మార్చేవాళ్ళకి ఇల్లు ఇవ్వను."

"అసహ్యంగా మాట్లాడకండి."

కోపంగా చెప్పాడు అప్పటిదాకా వాళ్ళిద్దరి సంభాషణ వింటూండిపోయిన పరాంకుశం.

"ఏమిటి అసహ్యం? ఇక్కడ వ్యాపారం పెడదామనుకుంటున్నారా? పోలీస్‌లకి రిపోర్ట్ ఇస్తాను జాగ్రత్త. ఎంత ధైర్యం? స్వయంగా వచ్చి, ఇలాంటి వాళ్ళకని స్పష్టంగా చెప్పి ఇల్లు కావాలని అడుగుతారా?"

గొంతు పెంచాడు ఆయన.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకండి."

పరాంకుశం కూడా గొంతు పెంచాడు కోపంగా.

"నా ఇంటికి వచ్చి నన్నే బెదిరిస్తునావా?"

"ఎవరు బెదిరించింది? ఇల్లు ఇస్తావా అని అడిగితే బెదరింపా?"

"ఉష్. పోదాం పద. అప్పుడే జనం మూగారు బయట." పరాంకుశం చెయ్యి నొక్కి చెప్పాడు శ్రీకంఠం.

"ఏమిటి? ఏం జరిగింది?" అంటూ ఒకరిద్దరు లోపలికి వచ్చారు. శ్రీకంఠం పరాంకుశం చెయ్యిపట్టుకుని బలవంతంగా లాక్కుపోయాడు.

"ధైర్యముంటే రా పోలీస్ స్టేషన్‌కి."

వెళుతున్న పరాంకుశం, శ్రీకంఠాన్ని ఉద్దేశించి అరుస్తున్నాడు ఆ ఇంటాయన గొంతు చించుకుని,

"ఛీ..ఛీ.." చెప్పాడు పరాంకుశం బయటపడ్డాక.

"వాడు ఉత్త రోగ్‌లా ఉన్నాడు. మరోచోట ప్రయత్నిద్దాం." ధైర్యం చెప్పాడు శ్రీకంఠం.

"ఇంకా ఎక్కడా అడగకూడదు." పరాంకుశం చెప్పాడు కోపంగా.

"ఆయన మీద ఎందుకలా తిరగబడ్డావు? నువ్వు ఇంత చిన్న విషయానికే కంట్రోల్ చేసుకోలేకపోతే లాభం లేదు. నెమ్మదితనం నేర్చుకోవాలి. భావిజీవితంలో ఇంకా ఇలాంటివి ఎన్ని ఎదుర్కోవాలో? కోపం ఎంతో విషమౌతుంది తెలుసా?"

పరాంకుశం మాట్లాడలేదు.

"లెసెన్ నెంబర్ వన్ నేర్చుకున్నావు. మర్చిపోవద్దు." హెచ్చరికగా చెప్పాడు శ్రీకంఠం.

"అలాగే"

పరాంకుశం భుజం తట్టి చెప్పాడు శ్రీకంఠం.

"ఇది సంఘం బ్రదర్. మనిషి ముందడుగు వేద్దామని ప్రయత్నిస్తే బలవంతంగా వెనక్కి లాగుతుంది."

✷✷✷

సాయంత్రం ఆఫీస్ అవగానే శ్రీకంఠం, పరాంకుశం మళ్ళీ నాయుడి దగ్గరకి వెళ్ళారు. ముగ్గురూ కలిసి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళారు.

తన స్నేహితుడైన ఇన్‌స్పెక్టర్ నాయుడు పరాంకుశాన్ని పరిచయం చేసి సంగతి చెప్పాడు. అభ్యుదయ భావాలు గల ఆ ఇన్‌స్పెక్టర్ అభినందనగా చూసి చెప్పాడు పరాంకుశంతో.

"హార్టీ కంగ్రాట్స్. మీలాంటి వాళ్ళు ముందుకు వస్తే ఊరు బాగుపడుతుంది. నా సర్వీస్‌లో ఇంతదాకా ఇలాంటి సహాయం నేను ఎవరికీ చేయలేదు. ఇకముందు కూడా చేస్తాననుకోను."

"థాంక్స్ సర్."

"మీరు ఎప్పుడు అంటే అప్పుడు నేను రెడీ. కాని, ఈ సంగతి అప్పటిదాకా రహస్యంగా ఉంచండి. ఎవరికీ చెప్పకండి."

"దేనికి?"

"మీకు తెలియదు. సౌదామిని మిమ్మల్ని పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతుందన్న సమాచారం అక్కడున్న కుంటివాడి చెవిన పడితే చాలు, ఇంక ఈ ఊళ్ళో ఉంచడు. ఇంకో ఊరికి దాటేస్తాడు. అది మన జూరిస్ డిక్షన్ కాదు కాబట్టి ఎవరం ఏం చేయలేం."

"అలాగే."

కాస్సేపాగి అడిగాడు శ్రీకంఠం.

"వ్యభిచారం చట్టరీత్యా నేరం అని తెలిసి కూడా, ముఖ్యంగా మన ఊళ్ళో ఎక్కడ ఆ నేరం జరుగుతుందో మీకు తెలిసి ఉండి కూడా ఎందుకు మీరు ఊరుకుంటున్నారు? తలుచుకుంటే మీరు దోషులను దండించి ఈ అన్యాయాన్ని ఆపవచ్చుగా?"

పోలీస్ ఇన్స్పెక్టర్ చిన్నగా నవ్వాడు.

"మీ ప్రశ్నకి సమాధానం నా దగ్గర ఉంది. ఆ వ్యాపారం చేసేవాళ్ళు 'బహుమతి, మామూలు,' పేర్లతో కింద నించి పై దాకా అధికారులందరికి లంచాలు ఇస్తారు. ఆ లంచానికి అలవాటుపడ్డ బాధ్యత గల అధికారులుండగా, కామంతో కొట్టుకొంటున్న కొంతమంది పెద్ద మనుషులుండగా దాన్ని నియంత్రించడం పోలీసుల వల్ల కాదని నా సమాధానం."

"మీరేం చేయలేరా?" అడిగాడు పరాంకుశం.

"చేద్దామనే ఉంది. కాని ఆ పెద్ద మనుషులు చేయనివ్వరు. నీళ్ళు, నిప్పు దొరకని చోటుకి బదిలీ చేయిస్తారు నన్ను."

"మరి ఆ అమాయకుల బ్రతుకులు బుగ్గిపాలు కావలసిందేనా? ఇలా ఎంతకాలం?"

"నా దగ్గర ఈ ప్రశ్నలకి మాత్రం జవాబు లేదు. వ్యక్తిగతంగా మీలా విచారించే వాళ్ళలో నేనూ ఒకణ్ణి."

"ఉదయం ఇల్లుకోసం ప్రయత్నించి భంగపడ్డాం." పరాంకుశం తనకి జరిగిన అనుభవాన్ని వివరించాడు.

పకపకా నవ్వాడు ఇన్స్పెక్టర్.

"ఇంటి గురించి ఇంక ప్రయత్నం చేయద్దు. నేను చూసి పెట్టగలను. నా హోదా వల్ల ఇల్లు నమ్మకంగా, త్వరగా దొరుకుతుంది."

శ్రీకంఠం, పరాంకుశాలు వెళ్ళిపోయాక చెప్పాడు ఇన్స్పెక్టర్ నాయుడితో.

"సౌదామిని బైటకు తీసుకురావడం తేలికే. కాని, తర్వాత అతనికి చాలా కష్టాలు పాపం."

"ఆ తర్వాత కూడా నువ్వు అతనికి సహాయం చేయాలి."

"అదంతా నేను చూసుకుంటానులే." చెప్పాడు టేబుల్ మీద ఉన్న హేట్ అందుకుని లేస్తూ.

***

*(తరువాయి భాగం వచ్చే సంచికలో)*

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..

Click here to go to KOUMUDI Library

